క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సత్కారం



విల్సన్‌ను సత్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

కడియం: వైద్య, ఆరోగ్య శాఖలో ఉత్తమ సేవలకు గాను స్వాతంత్య్ర దినోత్సవం రోజును అవార్డు అందుకున్న ఆ శాఖ ఉద్యోగి సీహెచ్‌ఎస్ విల్సన్ పాల్‌కు కడియం పీహెచ్‌సీలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను వైద్యులు ఎం.మణిజ్యోత్స్న, ఎస్.సాగసాయి మౌర్య కొనియాడారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ



లక్ష తులసి పూజ చేస్తున్న వేదపండితులు

కడియం: దుళ్లలోని రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాల స్వామి ఆలయంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా సోమవారం లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ ఖండవిల్లి రాధాకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు ఖండవిల్లి వాసు ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. విఖనస ఆచార్య స్వామివారి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం భక్తుల గోత్రనామాలతో అభిషేక పూర్వక పూజలు నిర్వహించారు. ప్రధాన హోమాల అనంతరం పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నేడు ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మ అమ్మవారు

కడియం: వేమగిరి గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర మంగళవారం జరగనుంది. మూడేళ్లకోసారి అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి ఈ ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు. ఏప్రిల్ 14న అమ్మవారిని గ్రామాల్లో తీసుకొచ్చి అప్పటి నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి మంగళస్నానం చేయించి భక్తులకు దర్శనం అవకాశం కల్పిస్తారు. రాత్రి నుంచి ఉదయం వరకూ జాతర నిర్వహించి బుధవారం అమ్మవారిని అత్తవారింటికి సాగనంపుతారు. జాతర సందర్భంగా ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేసింది. గరగ నృత్యాలతో పాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.

వైభవంగా శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం జేఎన్ రోడ్డులోని మన్యం గార్డెన్స్‌లో శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. మన్యం సంతోష్ కుమార్, సునీత సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లకు దర్శించుకున్నారు.

టూటౌన్ సీఐగా దుర్గారావు

కంబాలచెరువు: స్థానిక రెండో పట్టణ సీఐగా వి.దుర్గారావు నియమితులయ్యారు. ఆయన ఇప్పటి వరకూ వీఆర్‌లో ఉన్నారు. టూటౌన్ సీఐగా పనిచేసిన వీరవల్లి నిడదవోలుకు బదిలీ అయ్యారు.

21న భారత్ బంద్

రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21న రిజర్వేషన్ బచావో సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో జరిగే భారత బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం రాజీవ్‌గాంధీ కళాశాల సమావేశ హాలులో విలేకరులతో మాట్లాడారు. ఈ బంద్ నుంచి అత్యవసర సర్వీసులకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో మెలగాలి

కంబాలచెరువు: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో మెలగాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సదనంలో జనవిజ్ఞాన వేదిక తూర్పు గోదావరి జిల్లా శాఖ తరఫున సోమవారం సైన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎల్ఐసీ విశ్రాంత అధికారి చెక్కా తాతారావు హాజరయ్యారు. కోల్‌కతాలో వైద్యురాలి దారుణ హత్యకు నివాళిగా మౌనం పాటించారు. ముఖ్య అతిథి చెక్కా తాతారావు మాట్లాడుతూ నిరంతరం కొత్త అంశాలను నేర్చుకుంటూనే ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం జన విజ్ఞాన వేదిక మెజీషియన్ సీహెచ్ శ్రీరాములు మ్యాజిక్ ప్రదర్శన నిర్వహించారు.

ఆక్రమణలే ముంచాయా!

- కోటిపల్లి కాలువ గట్టు వెంబడి ఆక్రమణలు
- దెబ్బతిన్న గట్టు పటిష్టత
- గండి ఘటనపై భిన్నకథనాలు



కోటిపల్లి కాలువ గట్టుకు కడియపులంక వద్ద ఏర్పడిన గండి (ఫైల్)

కడియం: మండలంలోని కడియపులంక – పొట్టిలంక గ్రామాల రెవెన్యూ పరిధిలోని కోటిపల్లి కాలువకు గండి పడడం వెనుక అనేక కారణాలున్నట్టు తెలుస్తోంది. గండి కారణంగా దాదాపు 15 ఎకరాల్లో నర్సరీలు నీట మునిగిపోయాయి. దీంతో 40 మంది రైతులకు కోటి రూపాయలకు పైగా నష్టం సంభవించి ఉంటుందని అంచనా. ఈ ముంపు కారణంగా వివిధ రకాల ఉద్యాన పంటలు, పండ్ల, పూల రకాలకు చెందిన నర్సరీ మొక్కలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. గోదావరి గట్టును ఆనుకుని ఉన్న ఈ ప్రాంతంలో వేగంగా నీరు తగ్గేందుకు అవకాశం లేదు. ఈ నేపథ్యంలో నీట మునిగిన మొక్కలు, పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు.

భిన్న కథనాలు

ఏటా పంటల సీజన్ ప్రారంభంలో కాలువలకు నీరు విడుదల చేస్తారు. కానీ ఎప్పుడూ ఈ విధంగా కాలువ గట్టుకు గండి పడిన ఘటనల్లేవు. అయితే ఈ సారి ఎందుకు గండిపడిందన్న దానిపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. కాలువకు గతంలో ఎన్నడూ లేనంతగా నీటిని విడుదల చేశారని, ఆ కారణంగానే గండి పడిందని కొందరు రైతులు చెబుతున్నారు. కాలువ గట్టు వెంబడి విస్తృత స్థాయిలో ఆక్రమణలు జరిగాయని, ఇలా ఆక్రమించుకున్న కొందరు కాలువ గట్టుపై ఉండే మట్టిని అక్రమంగా తవ్వేసి మొక్కలు పెడుతున్నాని మరి కొందరు అభిప్రాయపడ్డారు. దీని కారణంగా గట్టు బలహీనపడిందని, అందువల్లనే గండి పడిందని చెబుతున్నారు. ఇందులో నిజానిజాలను ఇరిగేషన్, రెవెన్యూ అధికారులే తేల్చాల్సి ఉంది.

ఆక్రమణలే కారణమా..

రూరల్ నియోజకవర్గంలోని ధవళేశ్వరం నుంచి పొట్టిలంక వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర కోటిపల్లి కాలువ ఉంది. ఈ కాలువకు ఒక గట్టు జాతీయ రహదారి కాగా, మరొక గట్టుపై కొంత మేరకు నర్సరీల్లోకి రాకపోకలు సాగించే రోడ్డు మార్గం కూడా ఉంటుంది. మరికొంత భాగంలో మాత్రం మట్టితో కూడిన గట్టు మాత్రమే ఉంటుంది. ఇలా మట్టితో ఉన్న గట్టు వెంబడి నర్సరీలు, వివిధ రకాల ఉద్యాన పంటలను కొందరు సాగు చేస్తున్నారు. ఇలా సాగు చేసే కొందరు వ్యక్తులు స్వార్థంతో కాలువ గట్టు మట్టినే మొక్కల ప్యాకెట్లలో నింపుతున్నారని ఆరోపిస్తున్నారు. ఇలా అక్రమంగా మట్టి తవ్వకాల కారణంగా కాలువ గట్టు బలహీనంగా తయారైందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పర్యవేక్షణ కరువై..

ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కాలువ గట్టు వెంబడి ఆక్రమణలు పెరిగిపోయాయని పలువురు ఆరోపిస్తున్నారు. నేరుగా కాలువ గట్టుపైనే సాగు చేస్తున్న పరిస్థితులు కూడా నెలకొన్నాయంటే అధికారుల పర్యవేక్షణా లోపం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి కోటిపల్లి కాలువ ఎగువ ప్రాంతాల్లో సాగు భూములకు సక్రమంగా నీరందాలంటే కాలువలోకి పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాల్సిందే. అయితే ఆక్రమణల కారణంగా గట్టు బలహీనపడడంతోనే ఇప్పుడు గండి పడే పరిస్థితి వచ్చిందంటున్నారు. కొందరి స్వార్థం కారణంగా కోటిపల్లి కాలువనీటిపై ఆధారపడి సాగు చేసే రైతుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడిందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాలువ గట్టుపై ఆక్రమణలను తొలగించి, గట్టును పటిష్టపరిచాలని పలువురు రైతులు కోరుతున్నారు.

కోల్‌కతా వైద్యురాలి హత్యకు నిరసనగా ర్యాలీ



పోలీసు సిబ్బందికి రాఖీలు కడుతున్న విద్యార్థినులు

కడియం: స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాలేజీ విద్యార్థినులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. కోల్‌కతాలో డాక్టర్ మౌమితా దేబ్నాధ్‌ను హత్య చేసిన దుండగులను ఉరి తీయాలని, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తూ కొవ్వొత్తులు ర్యాలీ చేశారు. ముందుగా కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయుడు జి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి ఘోరాలు అరికట్టాలంటే కఠినమైన శిక్షలు అమలు చేయాలన్నారు. ఎస్సై దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలకు వేధింపులు ఎదురైనప్పుడు 100కు ఫోన్ చేయాలని, అపరిచితులకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ముందు కుటుంబ సభ్యులకు, పోలీసు వారికి తెలియజేయాలన్నారు. అనంతరం ఎస్సై దుర్గాప్రసాద్, పోలీస్ సిబ్బంది ప్రశాంత్ కుమార్, శ్రీనివాస్, శ్రీనివాసరావులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో బి.స్వర్ణవేణి, పంతం శ్రీవెంకటదుర్గ, ఎం.డేవిడ్, సూరిబాబు పాల్గొన్నారు.

పంచలోహ ఉత్సవ విగ్రహాల సమర్పణ



ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకువెళుతున్న షర్మిలారెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: స్థానిక క్వారీ మార్కెట్ ఎంఎస్ఆర్ నగర్‌లోని కళ్యాణిదేవి సమేత సోమలింగేశ్వరస్వామి ఆలయానికి స్వామివారి పంచలోహ ఉత్సవ విగ్రహాలను రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి దంపతులు సోమవారం అందజేశారు. ముందుగా మేళతాళాలతో ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ మేడపాటి సీతారామరెడ్డి ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారని, ఆయన జ్ఞాపకార్థంగా ఈ ఉత్సవ విగ్రహాలను అందచేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ రెడ్డి, హంసిని శ్రీయారెడ్డి, అభివన్ సిద్ధార్థ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం



శిక్షణ తీసుకుంటున్న వారితో డిపో మేనేజర్ షేక్ షబ్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీలోని హెవీ వాహనాల డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన 12వ బ్యాచ్ లో 20 మందికి సోమవారం నుంచి శిక్షణ ప్రారంభించినట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. వీరిలో 14 మందికి లైట్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, వారు హెవీ వాహనాల డ్రైవింగ్ లైసెన్స్ కోసం చేరారన్నారు. ఆరుగురికి హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉందని, డ్రైవింగ్‌లో మంచి నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం వీరు చేరారన్నారు. ఇప్పటి వరకూ శిక్షణ కళాశాలలో 188 మంది శిక్షణ పొంది, పేరెన్నిక గన్న వివిధ రంగాలలో ఉపాధి పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, మెకానికల్ ఇంజినీర్ ఈశ్వరరావు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ వీఎస్ఎల్ రావు, డ్రైవింగ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ గాంధీపార్కు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏరియాలు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, గానుగ వీధి, పాండురంగ స్వామి గుడి వీధి, ఆదిత్య హాస్పిటల్, విజయ హాస్పిటల్, టిప్పీ టాప్పీ ఏరియా, సురుచి స్వీట్స్ బైపాస్ రోడ్డు, బొమ్మిరెడ్డి సుధా హాస్పిటల్, బాట షోరూమ్, ప్రదీప్ హాస్పటల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

- ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ లలితా నగర్, హరిపురం, వీరభద్రపురం ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్ పేట ఏరియా, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, బ్రాహ్మణ అగ్రహారం, బూసమ్మ కాలనీ, శ్రీరామ్ నగర్, బీసీ కాలనీ, వీవీ కొండయ్య నగర్, కాతేరు గ్రామంలోని బ్రాహ్మణ అగ్రహారాలలో సరఫరా నిలిపివేస్తారు.

జాంపేట బ్యాంక్ చైర్మన్‌గా జయకుమార్



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ బొమ్మన జయకుమార్, డైరెక్టర్లు

రాజమహేంద్రవరం సిటీ: ది జాంపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ పాలక మండలి ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్నికల అధికారి ఎం.జగన్నాథరెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ బ్యాంకు చైర్మన్‌గా బొమ్మన జయకుమార్, వైస్ చైర్మన్‌గా రొబ్బి విజయశేఖర్ ఎన్నికయ్యాయన్నారు. రాష్ట్రంలో 10 బ్రాంచ్‌లలో కొనసాగుతున్న ఈ బ్యాంక్‌లో 27,724 మంది ఖాతాదారులున్నారన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ల ఎంపిక పూర్తి కావడంతో బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లుగా ఎం.లక్ష్మణరావు, గుంటముక్కల సత్యనారాయణ ప్రసాదరావు, జామశెట్టి గాంధీ, ద్వారా పార్వతి సుందరి, నాగేశ్వరరావు కనకం, ప్రసాదుల హరనాథ్, బీరా శ్రీనివాసరావు, బూరా రామచంద్రరావు, యాండ్రపు రామకృష్ణ, జామి కృష్ణలతో ప్రమాణ స్వీకారం చేయించినట్లు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగురే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఫొటోగ్రాఫర్లు

రాజమహేంద్రవరం సిటీ: ది గోదావరి ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అల్లు బాబీ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం లాలాచెరువు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సౌజన్య మనోవికాస్ చెవిటి, మూగ వికలాంగుల ఆశ్రమం విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ దివంగత ల్యాబ్ వెంకటేశ్వర కుటుంబానికి మార్ని లక్ష్మీనారాయణ చౌదరి రూ.16 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారులు రావ్ అండ్ రావ్ అధ్యక్షుడు సిరి శ్రీను, సెక్రటరీ లీల నాగు, ట్రెజరర్ ఆశ రాంబాబు, గౌరవ సలహాదారులు కేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బలరామ జయంతి



శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో గోపూజ చేస్తున్న అర్చక స్వాములు



ఇస్కాన్‌లో బలరామ జయంతి నిర్వహిస్తున్న శివానంద నిమాయదాస్ తదితరులు

సీటీఆర్ఐ: శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలలో భాగంగా సోమవారం బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్యాపురంలోని శ్రీకృష్ణ చైతన్య మిషన్ ఆశ్రమం, గోదావరి గట్టున గల ఇస్కాన్ ఆలయాలలో వైభవంగా ఈ కార్యక్రమం జరిగింది. ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీల త్రిదండి స్వామి భక్తి వైభవ పూరీ గోస్వామి మహరాజ్, శ్రీల ఆచార్యదేవ శ్రీ త్రిదండి స్వామి భక్తి కమల గోవింద గోస్వామి మహరాజ్ దివ్య ఆశీసులతో త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహరాజ్ చేతుల మీదుగా ఉదయం గోపూజ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన భగవద్గీత పోటీలలో పాల్గొన్న 200 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్లు ఆశ్రమం ఇన్‌చార్జి శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దాతలు పాల్గొన్నారు. ఇస్కాన్‌లో బలరామ జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రవచనాలు, విశ్వశాంతి యజ్ఞం, ప్రత్యేక పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ కమిటీ చైర్మన్ శివానంద నిమాయదాస్, శ్యామాంగ నిమాయదాస్, హేమంగా నిమాయదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలిపై దాడి



దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కంబాలచెరువు: హోంవర్క్ చేయలేదని మందలించిన ఉపాధ్యాయురాలిపై విద్యార్థిని కుటుంబ సభ్యులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్లో మట్టా సరితా రంజని గణితం ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఆమె సోమవారం ఉదయం పదో తరగతి విద్యార్థులకు లెక్కల పాఠాలు చెబుతున్నారు. ఆ సమయంలో నిహారిక అనే విద్యార్థినిని హోం వర్క్ చేయకపోవడంతో మందలించారు. నిహారిక ఆ విషయాన్ని ఇంటికి ఫోన్ చేసి చెప్పింది. దీంతో ఆమె తల్లిదండ్రులు, మేనమామ పాఠశాలకు వచ్చిన పాఠం చెబుతున్న సరితా రంజనిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు స్కూలు వద్దకు చేరుకుని ఆరా తీశారు. అనంతరం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థిని కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు.

వినాయక పందిళ్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, కాలుష్య రహితంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పందిళ్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, డీఆర్వో జి.నరసింహులు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం 1,12,869 దరఖాస్తులు రాగా 90,250 జారీ చేశామన్నారు. 318 పెండింగ్ ఉండగా, 22,301 తిరస్కరించడం జరిగిందన్నారు. పీవోఏ (అట్రాసిటీ కేసు) కేసులకు సంబంధించి పది మందికి ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉందన్నారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో లైటింగ్, గజఈతగాళ్లు, వైద్యశిబిరాలను ఆయా శాఖలు ఏర్పాటు చేయాలన్నారు.

రూ.2.30 లక్షల విలువైన గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులతో సెబ్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: మోటారు సైకిళ్లపై గంజాయిని తరలిస్తున్న ముఠాను దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద సెబ్ అధికారులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి 46.81కిలోల గంజాయి, మూడు మోటారు సైకిళ్లు ,రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఒడిశాలోని నాగులూరు నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి మూడు మోటారు సైకిళ్లపై నలుగురు గంజాయిని తరలిస్తున్నారు. జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు సెబ్ అధికారులు తనిఖీ చేశారు. ఉదయం 11.30 గంటల సమయంలో గంజాయి ముఠాను పట్టుకున్నారు. ఒడిశాలోని కలిమేల మండలం నాగులూరుకు చెందిన శంకం రాజుబాబు, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి గ్రామానికి చెందిన గళ్ల ఐజాక్ రాజులను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన వేలుసేరి బుజ్జిబాబు, వేలుసేరి వెంకి పరారీలో ఉన్నారన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2.30 లక్షల ఉంటుందని సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ తెలిపారు. తనిఖీలో ఇన్‌చార్జి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్సైలు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, డీటీఎఫ్ ఎస్సై ఆర్.క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

రాఖీ పండగ.. ఆత్మీయత నిండుగా..



ఆల్కాట్ గార్డెన్స్‌లో తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న అక్కలు

సీటీఆర్ఐ: సోదర ప్రేమకు ప్రతిరూపంగా రాఖీ పండగను భావిస్తారు. పిల్లల నుంచి పెద్దల వరకూ తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వదిస్తారు. సోదరులు సురక్షితంగా ఉండాలని, వారికి ఏ ఆపదా రాకూడదని కోరుకుంటూ అక్కాచెల్లెళ్లు రాఖీలు కడతారు. తమ అక్కాచెల్లెమ్మలకు జీవితాంతం అండగా ఉండాలని సోదరులు కోరుకుంటారు. ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన బైరెడ్డి శ్రీరాములుకి ఇద్దరు అమ్మాయిలు, ఏడుగురు కొడుకులు సంతానం. ఈ నేపథ్యంలో ఆ ఏడుగురు సోదరులకు అక్కలిద్దరూ ప్రతి ఏటా శ్రావణ పౌర్ణమి రోజు రాఖీ కట్టడం ఆనవాయితీ. అయితే అక్కలు వయస్సు 70 ఏళ్లు, తమ్ముళ్లు వయస్సు 60 ఏళ్ల పైనే ఉన్నాయి. వీరందరూ ఉద్యోగాల నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. కానీ ఏటా రాఖీ పండగ రోజు రాజమహేంద్రవరంలోని చిన్న తమ్ముడు ఇంటికి వీరందరూ వస్తారు. అక్కలు ప్రేమతో రాఖీలు కట్టి తమ్ముళ్లను ఆశీర్వదిస్తారు. తమ్ముళ్లు తమకు పుత్రులతో సమానమని, ఎంత పెద్దవారు అయినా తమకి చిన్నపిల్లలుగా కనిపిస్తారని ముచ్చట పడతారు. చిన్నప్పుడు రాఖీలు లేని రోజుల్లో బంతిపూలతో మాలని తయారు చేసి తమ్ముళ్ల చేతికి కట్టేవారమని గుర్తుచేసుకున్నారు. కాగా.. తమ్ముళ్లకు రాఖీలు కట్టడానికి పిట్టా భువనేశ్వరీదేవి వైజాగ్ నుంచి, సుగ్గు లక్ష్మీనరసింహాదేవి శ్రీకాకుళం జిల్లా గార మండలం నుంచి ఇక్కడకు వచ్చారు.

పడాల శ్రీనివాస్ సేవలు అభినందనీయం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ నటుడు చిరంజీవి అభిమానిగా పడాల శ్రీనివాస్ చేస్తున్న సేవలు అభినందనీయమని సీసీసీ చానల్ ఎండీ పంతం కొండలరావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక కంబాలచెరువు చిరంజీవి బస్‌షెల్టర్ సెంటర్‌లో పడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అతిథుల చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం దివ్యాంగులకు వీల్‌చైర్లు, హియరింగ్ మెషీన్లు, గొడుగులు పంపిణీ చేశారు. ముందుగా మూగజీవాలకు ఆహారం, అన్నార్తులకు ఆహార పొట్లాలు, పరిరక్షణకు మొక్కల పంపిణీ చేపట్టడం జరిగిందని పడాల శ్రీనివాస్ తెలిపారు. నామన వాసు, అడబాల రామకృష్ణారావు పాల్గొన్నారు.

అన్ని సమస్యలనూ పరిష్కరించాలి

రాజమహేంద్రవరం సిటీ: గోదావరికి పుష్కరాల నాటికి భక్తులు స్నానం చేసేందుకు పరిశుభ్రమైన నీరు, తాగేందుకు రక్షిత నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని గోదావరి పరిరక్షణ సమితి చైర్మన్ డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గోదావరి ప్రక్షాళనకు ఓఎన్‌జీసీ రూ.50 లక్షల నిధులతో కొనుగోలు చేసిన మెషీన్ ఏమైందో తేల్చాలన్నారు. ప్రజల నుంచి చందాలు వసూలు చేసి నిర్మించిన ఆనం కళా కేంద్రానికి అద్దెను రూ.70 వేలు (కరెంట్ బిల్లుతో) వసూలు చేస్తున్నారన్నారు. అది రూ.10 వేలుగా గత కమిషనర్ నిర్ణయించారని, కొత్తగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి కళాకారులను ఆదుకోవాలన్నారు. ఆనం కళా కేంద్రం పైన ఉన్న గంధం నాగసుబ్రహ్మణ్యం కళావేదికలో సాంస్కృతిక కార్యక్రమాలకు కరెంట్ బిల్లు మాత్రమే తీసుకుని, కవితా సదస్సులు, పుస్తకావిష్కరణలు చేసుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు.

రికార్డులు అప్పగించడం లేదని కార్యదర్శిపై ఫిర్యాదు

కడియం: దుళ్ల పంచాయతీ కార్యదర్శి సరోజా రాణి తాను పనిచేసిన కాలానికి సంబంధించిన రికార్డులను అప్పగించడం లేదని సర్పంచ్ కొండపల్లి పట్టియ్య సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి పదవీ కాలంలో పలు అవకతవకలకు పాల్పడ్డారని సర్పంచ్ పట్టియ్య ఆరోపించారు. ఈ మేరకు గతంలో కూడా గ్రీవెన్స్‌లో పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఏ మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. తన అనుమతి లేకుండా రూ.2,78,758ను విత్‌డ్రా చేశారన్నారు. అంతే కాకుండా పంచాయతీ నిధులను ఇష్టారీతిన ఖర్చు చేశారని, దానికి సంబంధించిన ఎటువంటి లెక్కలు చూపడం లేదని సర్పంచ్ అన్నారు. కార్యదర్శి చేసిన పొరపాట్ల కారణంగా గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు తనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కార్యదర్శి అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు.

వ్యాపారి డబ్బులు ఇవ్వడం లేదని..

పొట్టిలంక గ్రామానికి చెందిన కూసి గంగాధర్, కూసి సత్యనారాయణ, కూసి వెంకటేష్‌లు తాము పండించిన చామంతి పువ్వుల తాలూకు పట్టీ డబ్బులు రూ. 8,85,000లను కడియపులంక పీఎస్ఆర్ పూలకొట్టు వ్యాపారి పాటంశెట్టి సత్తిరాజు ఇవ్వడం లేదని సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు.

13 అర్జీల స్వీకరణ

రాజమహేంద్రవరం సిటీ: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు అందాయని కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. వాటిని నిబంధనల మేరకు పరిష్కరిస్తామని తెలిపారు.